క్లుప్తంగా

ఏపీ ఎన్జీవో కేలండర్ ఆవిష్కరణ



గోపాలపురం తహసీల్దార్ కార్యాలయంలో కేలండర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

గోపాలపురం: ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తూ సంఘం మరింత బలోపేతం కావాలని గోపాలపురం తహసీల్దార్ కె అజయ్ బాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఏపీ ఎన్జీవో కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఐఆర్, డీఏలు ఇస్తూ, పీఆర్సీ కమిషన్ రిపోర్టు వెంటనే ఇచ్చే విధంగా కృషి చేయాలన్నారు. లేకపోతే ఫిబ్రవరి నుంచి పోరాటానికి ఏపీ ఎన్జీవోలు సిద్ధమవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవోలు హరీష్, తారక్, పాపారావు, ఆశావల్లి, రమాదేవి, వుమెన్ వింగ్ చైర్మన్ లక్ష్మీ, రాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వీరభద్రరావును సత్కరిస్తున్న స్నేహితులు

నల్లజర్ల: అనంతపల్లి జెడ్పీ హైస్కూలులో 1979–80 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు గురువారం గ్రామంలో సమావేశమయ్యారు. తూర్పు చోడవరం జెడ్పీ హైస్కూలు టీచర్ ఆలపాటి పద్మవాణి అధ్యక్షత వహించారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వహిస్తున్న చెన్నా వీరభద్రరావు హాజరయ్యారు. అమెరికాలో విశాఖపటణంలో ఐటీ సంస్థలు నెలకొల్పి, ఇక్కడ ఉద్యోగాలు కల్పించిన వీరభద్రరావును మిత్రులు అభినందించి, సత్కరించారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



వేళ్లచింతలగూడెంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గోపాలపురం: క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. వేళ్లచింతలగూడెంలో ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. భారీ నగదు బహుమతులు, పార్టీలకతీతంగా సంబరాలు నిర్వహిస్తున్న ఫౌండర్ ఘంటా మధుకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ కాకులపాటి లలిత, దేవరపల్లి సీఐ బి నాగేశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



అన్నవరప్పాడులో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెరవలి: కలియుగ దైవం అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి మాస కల్యాణోత్సవం గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించి, కల్యాణాన్ని జరిపించారు. అన్నవరప్పాడు, మల్లేశ్వరం, పిట్టల వేమవరం గ్రామాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి



సత్యవాడలో రీ సర్వేపై మాట్లాడుతున్న తహసీల్దార్

ఉండ్రాజవరం: రెవెన్యూ సిబ్బంది పొలాల్లో రీసర్వే చేసేటప్పుడు రైతులు, భూ యజమానులు సహకరించాలని తహసీల్దార్ పీఎన్డీ ప్రసాద్ కోరారు. ఏపీ రీ సర్వేలో భాగంగా మండలంలో పైలట్ గ్రామంగా ఎంపికైన సత్యవాడ సచివాలయం వద్ద గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ లెవెల్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్ కార్యక్రమం శుక్రవారం నుండి 18వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రభుత్వం భూముల సర్వే ఈ నెల 21 నుండి 30 వరకు, ప్రైవేట్ భూముల సర్వే ఫిబ్రవరి 2 నుండి 27వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ జి.శ్రీనివాస్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎం.హరిప్రసాద్, వీఆర్వో లక్ష్మీసరసమ్మ, గ్రామ సర్వేయర్ ఆర్.మారుతి శ్రీరామ్, కార్యదర్శి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరిటేషన్‌లో లస్కర్లు

- పుష్కర కాలంగా భర్తీ కాని పోస్టులు
- 27 మందికి గాను ఇద్దరు పర్మినెంట్ ఉద్యోగులతో నెట్టుకొస్తున్న తీరు
- అవుట్ సోర్సింగ్‌లో మరో 9 మంది
- నెలల తరబడి వీరికి అందని జీతాలు
- నిష్క్రమణకు సిద్ధంగా ఉన్న వైనం



పెరవలి లాకులు



అన్నవరప్పాడు వద్ద నీటి ప్రవాహం తగ్గిన కాలువ

పెరవలి: ప్రధాన కాలువలపై ఉన్న లాకుల వద్ద సాగు నీటి ప్రవాహాన్ని క్రమబద్ధీకరణ చేసే లస్కర్ల వ్యవస్థకు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ప్రధాన కాలువలైన ఏలూరు కాలువ, బ్యాంక్ కెనాల్, కాకరపర్రు, నరసాపురం కాలువలున్నా, వీటిని పర్యవేక్షించాల్సిన లస్కర్లు లేకపోవటంతో.. కాలువలకు సక్రమంగా నీరందక రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఏ కాలువలపై మెట్ట పంటలున్నాయి, వరిసాగు జరుగుతోంది, ఎంత మేర సాగు నీరందిస్తే పొలాలకు సరిపోతుందనే వాటిపై సంపూర్ణ అవగాహన ఉన్న లస్కర్లు నేడు ఎక్కడా కానరావడం లేదు. కాలువలు అడుగడుగునా ఆక్రమణకు గురవడంతో పంట బోదెల్లా మారుతున్నాయి. గట్లు కుచించుకుపోతున్నాయి. దీనికి పర్యవేక్షించాల్సిన సిబ్బంది లేకపోవటమే కారణమంటున్నారు. వాస్తవానికి ఒక్కో లాకు వద్ద 20 నుండి 30 మంది లస్కర్ల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉంది. నేడు కనీసం పది మంది కూడా లేని దుస్థితి ఇరిగేషన్ శాఖది. ఈ శాఖ ఉద్యోగులు ప్రస్తుతం శిథిల భవనాల్లోనే విధులు నిర్వహించాల్సి వస్తోంది.

ఏయే కాలువలున్నాయి

ధవళేశ్వరం బ్యారేజీ నుండి అన్ని కాలువల ప్రవాహం మొదలవుతుంది. నిడదవోలు నియోజకవర్గంలో విజ్జేశ్వరం వద్ద ప్రారంభమైన కాలువ నిడదవోలు వచ్చేటప్పటికీ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని ముఖ్య పట్టణాలను ఆనుకుని వివిధ కాలువలు ప్రవహిస్తుంటాయి. పెరవలి మండలంలో కాకరపర్రు కెనాల్, బ్రాంచ్ కెనాల్, నరసాపురం కాలువలు ఉన్నాయి. వీటి పరిధిలో పిల్ల కాలువలు 230 వరకున్నాయి.

సాగు భూమి ఇలా..

కాకరపర్రు కెనాల్‌పై పెరవలి లాకు ఉండగా, దీని పరిధిలో 37,357 ఎకరాల సాగు భూమి, 51 గ్రామాలకు సాగునీరు అందించి 7 మండలాలకు సంబందించిన మూడు నియోజక వర్గాలైన తణుకు, నిడదవోలు, ఆచంటను కలుపుతోంది.

సిబ్బంది ఎందరంటే..

పెరవలి లాకుల పరిధిలో మొత్తం 27 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం (ఒక ఏఈ, ఒక గుమస్తా) ఇద్దరు పర్మినెంట్ ఉద్యోగులతో, 9 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ లాకుల పరిధిలో ఉండ్రాజవరం, రామయ్యగుంట, అజ్జరం, భూపయ్య కాలువ, ఈస్ట్ విప్పర్రు, ఖండవల్లి, పేకేరు కాలువలపై ఏడుగురు డెల్టా లస్కర్లకు అన్ని పోస్టులు ఖాళీగానే ఉన్నాయి, అలాగే కెనాల్ లస్కర్లు ఐదుగురు ఉండాలి. కానీ ఎవరూ లేరు, వైరు లస్కర్లు ఇద్దరికి.. ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వైర్ సూపరింటెండెంట్, లాకు లస్కర్లు నలుగురు, లాకు సూపరింటెండెంట్, గుమస్తాలు 2, వర్కు ఇన్‌స్పెక్టర్లు 2, వాచ్‌మన్ 1, ఎమెన్యూ లస్కర్ 1 పోస్టు ఉండగా, అన్నీ ఖాళీగానే ఉన్నాయి. వీరి విధులు కేవలం 9 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో భర్తీ చేస్తున్నారు. వీరికి ఏడాదిగా జీతాలు ఇవ్వకపోవటంతో ఉద్యోగాలను వదులుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

పుష్కర కాలంగా..

గత 12 ఏళ్లుగా ఈ శాఖలో ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవటంతో, కాలువల పర్యవేక్షణ లేక రైతులు నానాపాట్లు పడుతున్నారు. ఉన్న సిబ్బందికైనా మంచి భవనాలు ఉన్నాయంటే అవీ లేవు. పాత భవనాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ వ్యవస్థకు పూర్వ వైభవం రావాలంటే కొత్తగా ఉద్యోగ నియామకాలు చేపట్టి, తద్వారా కాలువల పర్యవేక్షణ, సాగునీరు సక్రమంగా అందేలా చేయాలని పలువురు అంటున్నారు.

ఇద్దరే పర్మినెంట్ ఉద్యోగులు



పెరవలి లాకుల పరిదిలో 27 మంది విదులు నిర్వర్తించాల్సి ఉంది. ప్రస్తుతం ఇద్దరు పర్మినెంట్ ఉద్యోగులతో పాటు, 9 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పని చేస్తున్నారు. వీరికి ఏడాది కాలంగా జీతాలు ఇవ్వాల్సి ఉంది.

– ఎస్ భాలమురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ, పెరవలి

పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలి



వేగేశ్వరపురం హైస్కూల్ వద్ద శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్



గోపాలపురం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంఈవో

తాళ్లపూడి: పరస్పర సహకారంతో ఎస్ఎంసీలు బాధ్యతాయుతంగా పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని ఎంఈవో సీహెచ్ బాలామణి అన్నారు. మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల యాజమాన్య కమిటీలకు గురువారం వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎంసీల బాధ్యతలు, పర్యావరణ పరిరక్షణ, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, పాఠశాల సామాజిక తనిఖీ, ప్రజల భాగస్వామ్యం, సమకాలీన సమస్యలు, పరిష్కారాలు తదితర అంశాలపై రిసోర్స్‌పర్సన్లు జి సతీష్, జె పాపారావు, డి.రాము శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 సీహెచ్ నెహ్రూజీ, మలకపల్లి, తాళ్లపూడి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు సీహెచ్ సుబ్బలక్ష్మి, కె శ్రీవాసవి, కమిటీ సభ్యులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

మండల వనరుల కేంద్రంలో..

పెరవలి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీలు బాధ్యతగా కృషి చేయాలని ఎంఈఓ షేక్ సూర్జన్ తెలిపారు. స్థానిక మండల వనరుల కేంద్రంలోమండలంలోని 38 పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్లు, హెచ్ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా, పెరిగేలా చర్యలు చేపట్టాలని ఎంఈఓ కోరారు.

భాగస్వాములు కావాలి

గోపాలపురం: విద్యార్థులు, పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీలు భాగస్వాములు కావాలని ఎంఈఓ జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎస్ఎంసీలు, హెచ్ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులు, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, సామాజిక తనిఖీ, మధ్యాహ్న భోజన పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఎంఈఓ సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు కె.శ్రీనివాసరావు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మైమరచి తాగేశారు..!

- రెండు రోజుల్లో రూ.11 కోట్ల మద్యం విక్రయాలు
- న్యూ ఇయర్ వేడుకల్లో మందుబాబుల జోష్



చాగల్లు ఐఎంఎల్ డిపో

చాగల్లు: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మందుబాబులు మద్యంలో మునిగితేలారు. ఐఎంఎల్ డిపో పరిధిలో డిసెంబర్ 30, 31 తేదీల్లో రెండు రోజుల వ్యవధిలోనే ఏకంగా రూ.11 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. జనవరి ఒకటితో కలిపి మూడు రోజుల్లో ఏకంగా రూ.11.68 కోట్ల విలువ చేసే లిక్కర్ కిక్ పొందారు. న్యూ ఇయర్ వేళ మంచినీళ్లలా మద్యం తాగేశారు.

డిసెంబర్ చివరి రెండు రోజుల్లోనే రూ.11 కోట్ల విలువైన మద్యం సేల్ అయింది. మొత్తం 20,074 మద్యం కేసులు విక్రయించారు. అందులో బీర్లు 5,815, ఐఎంఎల్ 14,258 కేసులు అమ్ముడయ్యాయి. జనవరి ఒకటిన రూ.68 లక్షల విక్రయాలు జరిగాయి. డిసెంబర్ 31న అర్ధరాత్రి ఒంటి గంట వరకు విక్రయాలకు అనుమతి ఉండడంతో, రెట్టింపు స్థాయిలో విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. నూతన సంవత్సర వేడుకల్లో భారీగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఎక్సైజ్ శాఖ డిసెంబర్ 31, జనవరి ఒకటో తేదీల్లో అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా మద్యం వ్యాపారులు ముందుగానే భారీ స్థాయిలో స్టాకు సిద్ధం చేసుకున్నారు.

ఏరులై పారి..

నూతన సంవత్సరం వేళ జిల్లాలో మద్యం ఏరులై పారింది. వైన్‌షాపులు మందుబాబులతో కిటకిటలాడాయి. చాగల్లు ఐఎంఎల్ డిపో పరిధిలో కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలుతో పాటు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, ఏలూరు, జిల్లాల్లోని 111 షాపులు, 10 బార్లకు మద్యం సరఫరా అవుతోంది. ఇక్కడి నుంచి డిసెంబర్‌లో రెండు రోజుల్లో 20,074 మద్యం కేసులు సరఫరా చేశారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.11 కోట్ల ఆదాయం లభించింది. సాధారణ రోజుల్లో సరాసరి రూ.3 కోట్ల మేర అమ్మకాలు జరుగుతాయి. న్యూ ఇయర్ పేరు చెప్పి మందుబాబులు రెట్టింపు స్థాయిలో తాగేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాగల్లు: చిక్కాల సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శుక్ర, శనివారాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు చిక్కాల, చిక్కాలపాలెం గ్రామాలతో పాటు, కలవలపల్లి సబ్‌స్టేషన్ 11 కేవీ కలవలపల్లి–చిక్కాల ఫీడర్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

నిడదవోలు రూరల్: పురుషోత్తపల్లి, కాటకోటేశ్వరం సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ తెలిపారు. పురుషోత్తపల్లి, గోపవరం, కోరుమామిడి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

దేవరపల్లి: లైన్ల నిర్వహణ కోసం స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ తెలిపారు. 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌లో బందపురం, అచ్చయపాలెం, గొల్లగూడెం ఫీడర్లలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. వ్యవసాయానికి ఉదయం 6 నుంచి 8 వరకు సరఫరా ఉంటుందన్నారు. దేవరపల్లిలో 11 కేవీ నూతన ఫీడర్ ఆర్‌డీడీఎస్ పనుల కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

దేవరపల్లి: పల్లంట్ల సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదు. పల్లంట్ల 11 కేవీ లోకల్, వ్యవసాయ ఫీడర్లకు లక్ష్మీపురం, చిక్కాల ఫీడర్లకు సరఫరా నిలిపివేస్తారు. వ్యవసాయానికి ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సరఫరా ఉంటుంది.

ఉండ్రాజవరం: పాలంగి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం పాలంగి, కె.సావరం, చివటం గ్రామాలకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నారు. శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది.

పారదర్శకంగా సమత్వ సర్వే నిర్వహించాలి

– ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వెంకటేశ్వరరావు



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

పెరవలి: భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సమత్వ సర్వే ప్రారంభించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ టి.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వేయర్లు, పంచాయితీ కార్యదర్శులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు భూముల సర్వేలు పూర్తయ్యాయని, ఇక గ్రామాల్లో పంచాయతీల వారీగా సర్వే చేయాలని వివరించారు. ఈ సర్వేలో గ్రామ కంఠ భూములకు ఒక్కొక్క నంబర్ కేటాయించాల్సి ఉందని, ఈ సర్వే పారదర్శకంగా ఉండాలన్నారు. పూర్వ రికార్డుల ప్రకారం పంచాయతీలకు కేటాయించిన సర్వే నంబర్ల ఆధారంగా సర్వే నిర్వహించాలన్నారు. ఇందుకు మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఖండవల్లి గ్రామాన్ని ఎంపిక చేశామని తెలిపారు. బందంగా ఏర్పడి సర్వే చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ డి.అచ్యుతకుమారి మాట్లాడుతూ మండలంలో 14 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 18 పంచాయితీలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటి వరకు 8 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

– ప్లాట్ రిక్షా కార్మికుల ఆందోళన



పట్టణంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

నిడదవోలు: భవన నిర్మాణ రంగానికి చెందిన 34 రకాల వృత్తుల వారికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో గురువారం నిడదవోలు ప్లాట్ రిక్షా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు సంఘ అధ్యక్షుడు కోనేటి మల్లేశ్వరరావు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పిచ్చా సూర్యకిరణ్, లంకాడ గణపతి మాట్లాడుతూ, నిరుపేదలైన తమకు కార్మిక శాఖ నుండి ఏ విధమైన ఆర్థిక ప్రయోజనాలు లభించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మ కుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే భవన నిర్మాణ కార్మికులకు మేలు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని దుయ్యబట్టారు. అధికారం చేపట్టి ఆరు నెలలైనా ఉప ముఖ్యమంత్రి కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ, ప్రశ్నించడం మరిచారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తోరం సూరిబాబు, సత్తిబాబు, నాగరాజు, నంగాలు, వెంకట్రావు, రమణ, సిర్రా రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

భార్యపై భర్త కత్తితో దాడి

దేవరపల్లి: అనుమానంతో భార్యపై భర్త కత్తితో దాడి చేసి గాయపర్చిన ఉదంతమిది. మండలంలోని గౌరీపట్నం శివారు కొండగూడెంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. స్థానికుల వివరాల మేరకు, కొండగూడేనికి చెందిన రాపాక నాగార్జున తన భార్య రాజామణిపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఆమెపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజామణిని చికిత్స కోసం కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి జీజీహెచ్‌కు పంపించారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలంలో ఖాళీగా ఉన్న తొమ్మిది రేషన్ దుకాణ డీలర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ గురువారం తెలిపారు. తాడిమళ్లలో రెండు (ఓసీ, మహిళ), (ఎస్టీ), ఉనకరమిల్లి (బీసీ–బీ), సమిశ్రగూడెంలో రెండు (బీసీ–ఏ), (ఎస్సీ–మహిళ), కోరుమామిడి (ఓసీ–మహిళ), శంకరాపురం (ఓసీ– మహిళ), నిడదవోలు పట్టణంలో రెండు (బీసీ–బీ), (ఈడబ్ల్యూఎస్) కేటగిరీల్లో నియమకాలు చేపడతామన్నారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించడంతో పాటు, కుల ధ్రువీకరణ పత్రం, పుట్టిన తేదీ, టీసీ కలిగి, స్థానికులై ఉండాలన్నారు. ఈ నెల 10వ తేదీలోపు కొవ్వూరు ఆర్డీఓ, సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 21న కొవ్వూరు ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు 80 మార్కులకు రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. మిగిలిన 20 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహించి, డీలర్ల ఎంపిక చేస్తారని చెప్పారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: పెన్నులను కొనేందుకు ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి ఇంటికి రాలేదని లాలాచెరువు బత్తిన నగర్‌కు చెందిన టి.అరుణ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె 16 ఏళ్ల కుమార్తె గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో పెన్నులు కొనుక్కుంటానని చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఇప్పటివరకు తిరిగిరాలేదు. ఎస్సై ఆర్.అంకారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మల్లేశ్వరంలో రైతు సమస్యను వింటున్న తహసీల్దార్

పెరవలి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ డి.అచ్యుతకుమారి తెలిపారు. మల్లేశ్వరం, అన్నవరప్పాడుల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మల్లేశ్వరంలో జరిగిన సదస్సులో భూ సర్వేకు 7, రెవెన్యూకి 4 అర్జీలు వచ్చాయని, అన్నవరప్పాడులో 3 సర్వే కోసం వచ్చాయని తెలిపారు. వీటిని త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ సన్నిబాబు, ఆర్ఐ పావని, ఎంపీటీసీ కొటిపల్లి దేవికారాణి, ఉప సర్పంచ్ బొలిశెట్టి పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

గోపాలపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆయా సంస్థల జిల్లా అధికారులు హరీష్ చంద్ర ప్రసాద్, పెరుమాళ్ల రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మూడు ప్రముఖ కంపెనీల్లో వివిధ ఉద్యోగాల్లో పని చేయడానికి బీఫార్మసీ, ఎం ఫార్మసీ, డీ ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. 19 నుండి 35 ఏళ్లలోపు యువతీయువకులు తమ రెజ్యూమ్, సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 99888 53335, 87901 18349 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రజా సంఘాల కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అరుణ్

నిడదవోలు: పట్టణంలోని చర్చిపేటలో సంత మార్కెట్ వద్ద ప్రజా సంఘాల కార్యాలయాన్ని గురువారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ, నిరంతరం ప్రజా సమస్యలు, ఉద్యోగ, కార్మిక, దళిత సమస్యలపై పోరాటాలు చేసే ప్రజా సంఘాలు తమ సొంత కార్యాలయం ఏర్పాటు చేసుకోవటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, ఏపీ యునైటెడ్ ప్రభుత్వ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ నర్సెస్ యూనియన్ జేఏసీ చైర్మన్ దయామణి, సీఐటీయూ నాయకులు జి.డానియల్, గంటి కృష్ణ, యర్రా శ్రీను, డొంకా రమేష్, ఉసురుమర్తి ప్రభాకర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.చిరంజీవి, సాయి, రమణ, రసూల్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు రహదారికి మరమ్మతులు



బ్రాహ్మణగూడెం వద్ద రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

చాగల్లు: నిడదవోలు–పంగిడి ప్రధాన రహదారికి ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చే పనులను ఆర్అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. మూడు నెలలుగా ఈ రోడ్డుపై గుంతల కారణంగా ఎందరో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ప్రయాణికులు, స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. తూతూమాత్రంగా కాకుండా, నాణ్యత ప్రమాణాలతో మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో ఐదుగురు

సీటీఆర్ఐ: రామదాసుపేటలో సారా తాగుతున్న ఐదుగురిని గురువారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పట్టుకున్నారు. స్థానిక 46వ డివిజన్‌కు గురువారం ఆయన ఒక అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లారు. సమీపంలో సారా తాగుతున్న ఐదుగురి పట్టుకున్నారు. స్థానికంగా సారా విక్రయిస్తున్న మహిళను మందలించారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.